వాయిస్ టుడే
హైదరాబాద్
సోమవారం, 30 డిసెంబరు 2024

# అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముక్కోటి ఏర్పాట్లు చేయాలి

## కలెక్టర్ జితేష్ వి పాటిల్



భద్రాచలం, డిసెంబర్ 29 (వాయిస్ టు డే ). భద్రాచలం లో జరగనున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు అన్నీ సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. ఆదివాసి గిరిజనులు ఎక్కువ శాతం నివసిస్తున్న జిల్లాను పర్యాటక రంగంగా అభివృద్ధి దిశగా తీసుకొని వెళ్లి గిరిజనుల ఆచార వ్యవహారాలు గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలు భద్రాచలంకు వచ్చే భక్తులకు తెలియజేసి వారి ద్వారా ప్రపంచ స్థాయిలో భద్రాచలం పేరు మారుమోగేలా కృషి చేస్తున్నామని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు.

ఆదివారం భద్రాచలంలోని గోదావరి కరకట్ట ప్రదేశాల పక్కన టూరిజం స్పాట్ గా నిర్మిస్తున్న రివర్ సైడ్ క్యాంపెనింగ్, గిరిజన కల్చర్ స్టాల్స్ ఏర్పాట్ల నిర్మాణం పనులను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్, చింతూరు ప్రాజెక్టు అధికారి అపూర్వ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 09, 10 తేదీలలో జరిగే సీతారామచంద్రస్వామి తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నందున ఈ జిల్లా యొక్క సంస్కృతి సాంప్రదాయాలు పర్యాటక దర్శనీయ స్థలాలు తెలిసే విధంగా ముఖ్యంగా గోదావరి కరకట్ట ప్రదేశాలలో రివర్ ఫెస్టివల్ తరహాలో భక్తులకు కనువిందు కలిగేలా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వచ్చిన భక్తులు వసతి కొరకు అన్ని సౌకర్యాలతో ట్రైబల్ కు సంబంధించిన పాతకాలపు నివాసాలు ఏర్పాటు చేసి వారికి సంబంధించిన సాంప్రదాయమైన వివిధ రకాల నృత్యాలతో పాటు ఆదివాసి సాంప్రదాయక వంటకాలు, వెదురు క్రాఫ్ట్ కడాఖండాలు టూరిస్టులకు అందుబాటులో ఉండేలా వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు సాయంత్రం పూట గిరిజన కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నామని, టూరిస్టులు సరదాగా సేదతీరి ఫోటోలు దిగడానికి సెల్ఫీ పాయింట్ రివర్ క్యాంపైనింగ్ దగ్గర ఏర్పాటు చేయాలని, నాయక్ పోడు, కోయ తెగ, వడ్డరి, కుమ్మరి, మేదరి మరియు క్రాఫ్స్ వస్తువులతో పాటు గిరిజన వంటకాలు, తేనె మరియు తాటి బెల్లం, రాగి జావా, జొన్న జావా వివిధ రకాల న్యూట్రిషన్ కి సంబంధించిన ఆహార పదార్థాలు గిరిజనులు అమ్ముకొని ఉపాధి పొందడానికి 40 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ స్టాల్స్ లో ప్లాస్టిక్ వినియోగం లేకుండా ప్రతీది పేపర్ బ్యాగులు పేపర్ కప్పులు పేపర్ ప్యాకింగ్ ను మాత్రమే వాడాలని, వచ్చే నెల 8వ తారీఖు నుండి ఈ యొక్క ప్రక్రియ ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం రివర్ ఫెస్టివల్ కార్యక్రమం వచ్చే సంవత్సరం మార్చి వరకు కొనసాగిస్తామని, మరల నవంబర్ నుండి ప్రారంభించి ఆరు నెలలపాటు జరిగేలా ప్రణాళికల రూపొందిస్తామని అన్నారు. బొజ్జుగుప్ప గ్రామంలోని పర్యాటక కేంద్రానికి పర్యాటకులు వెళ్లే విధంగా వచ్చేనెల 5వ తేదీ నుండి కరపత్రాలు మరియు బుక్ లెట్స్ పంపిణీ చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఇరిగేషన్, ఐటీడీఏ అధికారులు సమన్వయంతో ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేవిధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్ రావు, మత్స్య శాఖ ఏడి ఇంతియాజ్ అహ్మద్, ఇరిగేషన్ ఈ ఈ రాంప్రసాద్, డి ఈ వెంకటేశ్వర్లు, ఏఈ వెంకటేశ్వరరావు, ఏ సి ఎం ఓ రమణయ్య, మ్యూజియం ఇంచార్జ్ వీరాస్వామి, ఐకెపి ఏపిఎం జగదీష్, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్ మరియు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## సంతోషాల మధ్య నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుందాం

### జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్



జగిత్యాల్ వాయిస్ టుడే ప్రతినిధి డిసెంబర్ 29: వేడుకల పేరుతో ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే ఉపేక్షించం. జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్త్ తో పెట్రోలింగ్,డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు..సంతోషాల మధ్య నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.

నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ జిల్లా పరిధిలోని ప్రజలు ప్రశాంతమైన వాతవరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీస్ శాఖ తరుపున భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్బంగా జిల్లా పోలీస్ యంత్రాంగం మొత్తం క్యూఆర్టి స్పెషల్ పార్టీ, సి సి ఎస్,స్పెషల్ బ్రాంచ్, ఐటీ సెల్ టీం,షి టీం బృందాలతో పటిష్ట బందోబస్త్ మధ్య ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుంది. పోలీసుల అధ్వర్యంలో పట్టణ, గ్రామీణా ప్రాంతాల్లోను ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనీఖీలు నిర్వహించబడుతాయని. అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

**పోలీసుల సూచనలు నిబంధనలు...**

1.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసుకునే కార్యక్రమాలు రాత్రి 12:30 గంటల వరకు పూర్తి కావాలి. తర్వాత కొనసాగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

2.టపాసులు,మైకులు ఎక్కువ సౌండ్ పెట్టి ఎవరిని ఇబ్బంది పెట్టకూడదని డీజే లు నిషేధం, వినియోగిస్తే సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తాం.

3.మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం,వాహనాలు ఇష్టానుసారంగా వేగంగా నడిపితే కేసులు నమోదు చేయడంతోపాటు జైలు శిక్ష విధించబడుతుంది.

4.ఇల్లు,ప్రవేట్ ఆస్తులపై,వీధి దీపాల పై రాళ్లు వేయడం, అద్దాలను పగలగొట్టడం, మహిళలను ఇబ్బంది పెట్టిన, అసభ్యంగా ప్రవర్తిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

5.ర్యాష్ డ్రైవింగ్,బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్,సైలెన్సర్ లను తీసివేసి వాహనాలు నడపడం,శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

6.న్యూ ఇయర్ వేడుకలలో నిషేదిత డ్రగ్స్,గాంజా వంటి మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

7.మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలో క్లోజ్ చేయాలి, మైనర్లకు మద్యం అమ్మకూడదు.

8.బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు పెడుతాం.

9.మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని,వారి వల్ల ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే వారి సంరక్షకుల పైన కేసులు నమోదు చేస్తాం.

10.ఈ నూతన సంవత్సర వేడుకుల సందర్బంగా ఎర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయన సరే నిర్వహకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తూ అనుమతులు తీసుకోవాలి.

పై అంక్షలను ఎవరైన అతిక్రమించిన, ఉల్లంఘించినట్లుగా ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 నంబర్‌కు సమాచారం అందించడం ద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని, ఈ వేడుకలను ప్రజలు,యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకరమైన వాతరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ ప్రజలకు సూచించారు. 2025 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి కలగాలని ఆశిస్తూ,జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు.

## జగిత్యాలలో బాలిక కిడ్నాప్ కలకలం

### కిట్నాపర్‌ను వెంటనే చితకబాదిన స్థానికులు

జగిత్యాల్ వాయిస్ టుడే ప్రతినిధి డిసెంబర్ 29: జగిత్యాల కొత్త బస్టాండ్ సమీపంలో నటరాజ్ చౌరస్తా వద్ద 5 ఏళ్ల బాలికను గుర్తు తెలియని వ్యక్తి కిడ్నాప్ చేసేందుకు యత్నించాడు. పట్టణానికి చెందిన తల్లి తన కూతురితో అప్పుడే బస్సు దిగి ఆటో కోసం ఎదురు చూస్తుండగా కిడ్నాపర్ బాలికను ఎత్తుకుని పరార్ అవుతుండగా బాలిక తల్లి అరిచింది. స్థానికులు కిడ్నాపర్ ను అడ్డుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. నిందితుడు ముస్తాబాద్ మండలం పోతుగల్ కు చెందిన నవీన్ గా అనుమానిస్తున్నారు.



## శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

బండ్లగూడ జాగీర్ ,డిసెంబర్ 29 వాయిస్ టుడే : మాలధారణ చేసిన అయ్యప్ప భక్తులు శనివారం శబరిమలకు బయలుదేరారు. బండ్లగూడ జాగీర్ మున్సిపాల్ కార్పొరేషన్ పరిధిలోని ఏడవ వార్డు లో గల హనుమాన్ సన్నిధానంలో నియమనిష్టలతో అయ్యప్ప స్వామి దీక్షను పూర్తిచేసుకొని స్వాములు శబరిమలకు యాత్ర ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నరహరి గురుస్వామి,వేణు గోపాల్ గురుస్వామి,జగదీష్ గురుస్వామి,మల్లేష్ గురుస్వామి, మహేష్ గురుస్వామి. సన్నిధానం స్వాములు, స్థానిక కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మాంజా దారం తగిలి నలుగురికి గాయాలు

జనగామటౌన్: ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారికి మాంజా దారం తగలడంతో నలుగురికి గాయాలైన సంఘటన జనగామలో ఆదివారం జరిగింది. బచ్చన్నపేటకు చెందిన ఎస్.సనత్‌కుమార్, సాయిరాం, సాయికుమార్‌లు జనగామలోని సిద్ధిపేట రోడ్డు వైపు వంతెనపై ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. గాలి పటానికి చెందిన మాంజా దారం తగలడంతో సనత్‌కుమార్ గొంతుకు తీవ్ర గాయమైంది. సాయిరాం, సాయికుమార్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. మరో ద్విచక్రవాహనంపై తల్లిదండ్రులతో కలిసి ప్రయాణిస్తున్న పదేళ్ల బాలుడు వీక్షిత్‌కు గొంతు భాగంలో దారం తగలడంతో తీవ్ర గాయమైంది. సనత్‌కుమార్‌కు ఆసుపత్రిలో చికిత్స అందించారు. వీక్షిత్‌ను చికిత్స నిమిత్తం ఎంసీహెచ్‌కు తరలించారు. నిషేధిత మాంజా దారాల విక్రయాలపై అటవీ, పోలీసుల శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బాధిత కుటుంబాల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆహారం వికటించి వృద్ధురాలి మృతి



బీర్కూర్ : ఇంట్లో వండిన ఆహారం తిని ఓ వృద్ధురాలు మృతి చెందగా.. ముగ్గురు కుటుంబీకులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన బరంగెడ్డిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. లక్కపల్లి గంగవ్వ (60) అనే వృద్ధురాలు ఈ నెల 26న ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి పప్పుతో భోజనం చేశారు. అదే రోజు మధ్యాహ్నం గంగవ్వకు వాంతులు, వీరేచనాలై తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సాయంత్రం గంగవ్వ కుమారుడు సాయిలు, కోడలు రాధిక, పెద్ద మనవడు సాయివర్ధన్‌లు సైతం అస్వస్థతకు గురయ్యారు. వారిని చికిత్స నిమిత్తం బంధువులు బాన్సువాడ ప్రభుత్వ దవాఖానాలో చేర్పించారు. గంగవ్వ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం 27న నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానాకు తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ 28న రాత్రి ఆమె మృతి చెందారు. మిగిలిన ముగ్గురు కోలుకున్నారు. ఆహారం వికటించడంతోనే అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారని సాయిలు పేర్కొన్నారు. బరంగెడ్డిలో గంగవ్వ అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు.

## ఉపాధిహామీలో అక్రమాలు..!

### సామాజిక తనిఖీలో రూ.10 లక్షల రికవరీకి నోటీసులు



కోస్గి గ్రామీణం: ఉపాధిహామీ పనుల్లో జరిగిన అక్రమాలపై సామాజిక తనిఖీలో శనివారం రాత్రి అధికారులు లెక్క తేల్చారు. కోస్గి మండల కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో డీఆర్డీవో పీడీ మొఘులప్ప ఆధ్వర్యంలో అధికారులతో కలిసి 14వ విడత సామాజిక తనిఖీ చేపట్టారు. 26 పంచాయతీలో ఉపాధిహామీ పథకంలో పనులు చేపట్టి అలాగే సంవత్సర కాలంలో పలు పనులపై మొత్తం రూ.4,83,07,507 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. తనిఖీలో రూ.2,95,850 లక్షలు రికవరీ చేయాలని అధికారులను పీడీ ఆదేశించారు. రూ.7,41,176 లక్షలకు గాను సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు అందించాలని, వారం రోజుల్లో వివరణ ఇవ్వకపోతే డబ్బును సైతం రికవరీ చేయాలని తెలిపారు. మొత్తం రూ.10,37,076 లక్షలు రికవరీ చేయాలని సంబంధిత అధికారులకు లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. పలు గ్రామాల్లో పీఆర్ఏఈ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు, పాఠశాల, పంచాయతీ భవన నిర్మాణ పనుల్లో జరిగిన ఖర్చు, రికార్డులను పంచాయతీ సిబ్బందికి అందించకపోవడంతో షోకాజ్ నోటీసులు అందించి పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ఫారెస్ట్ నర్సరీలో నాటిన మొక్కలపై పూర్తి వివరాలు లేవని, రిజిస్టర్లలో నమోదు చేయనందుకు షోకాజ్ నోటీసులు అందించాలని అన్నారు. కొత్తపల్లి, చంద్రవంచ గ్రామాల్లో చేపట్టిన పనులపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ నర్సయ్య, ఏపీఓ నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

# మేం ఎంతో మాకు అంత నినాదంతో బీసీలు మరో పోరాటానికి సిద్ధం






కరీంనగర్: మేం ఎంతో మాకు అంత నినాదంతో బీసీలు మరో పోరాటానికి సిద్ధం కావాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజారామ్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కృషి భవన్ లో గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన బీసి ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యావంతుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశ జనాభాలో 50% ఉన్న బీసీలకు స్వాతంత్రానికి ముందు నుంచే తీవ్ర అన్యాయం జరుగుతూ వచ్చిందని అన్నారు. ఈ దేశంలో కులము, మతం పేరుతో రిజర్వేషన్లు కల్పించిన పాలకులు.. మెజార్టీ ప్రజలైన బీసిలకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. మండల్ కమిషన్ పోరాటాల ద్వారా బీసీలకు రిజర్వేషన్ అవకాశాలు వచ్చినా ఆధిపత్య కుల పార్టీలైన కాంగ్రెస్, బిజెపితోపాటు కమ్యూనిస్టు పార్టీలు సైతం తీవ్రంగా వ్యతిరేకించాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశ సంపద సృష్టిలో కీలక పాత్ర పోషిస్తున్న వృత్తి కులాలైన బీసీలు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. బిసి ప్రధానమంత్రినని చెప్పుకుంటున్న నరేంద్ర మోడీ.. ఈబీసీ రిజర్వేషన్లు తెచ్చి బీసీల గొంతు కోశారని విమర్శించారు. మరోవైపు జీవో 29 తీసుకొచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిసి నిరుద్యోగుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి మన హక్కుల సాధన కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని రాజారాం యాదవ్ పిలుపునిచ్చారు. అంతకుముందు ప్రత్యేక అతిథిగా హాజరైన మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ ఎస్ నాయకురాలు తులా ఉమా మాట్లాడుతూ.. ఆధిపత్య కుల నాయకుల జెండాలు మోసిన బీసీలు ఇప్పుడు ప్రశ్నించే స్థాయికి వచ్చారని అన్నారు. అందుకే అన్ని పార్టీలు ఇప్పుడు బీసీల గురించి మాట్లాడాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయని అభిప్రాయపడ్డారు. అన్ని రంగాల్లో న్యాయమాయన వాటా కోసం బీసీలంతా ఒక్కటి కావలసిన సందర్భం వచ్చిందని గుర్తు చేశారు. బీసీలు నాయకులు ఎదిగిన కేవలం ఎంపిటిసిలు జడ్పిటిసిలు సర్పంచ్లు గానే మిగిలిపోతున్నారని అన్నారు. మాజీ జడ్పిటిసి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గంట రాముల యాదవ్ మాట్లాడుతూ.. బీసీ ఉద్యమంలో యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. బీసీ నాయకత్వం ఎదిగి వచ్చినా పార్టీలు టికెట్లు ఇవ్వకుండా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. దీన్ని బీసీ సంఘాలు నాయకులు అర్థం చేసుకోవలసిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, బిసి బిసి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల విజయ్ కుమార్, బిసి ఉద్యోగుల సంఘం నాయకులు మర్రి శ్రీనివాస్ యాదవ్, సీనియర్ అడ్వకేట్ రాజన్న యాదవ్, పాంచాల సత్యనారాయణ, ప్రభాకర్ టిఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోట రాములు యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి లతా పటేల్, బీసీ సంఘం నాయకురాలు పావని గౌడ, సంఘం రాష్ట్ర నాయకులు పొన్నం అమరేందర్ గౌడ్, మెకానిక్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి గాలిపల్లి రామ్ నారాయణ, సిద్దిపేట జిల్లా గౌడ సంఘం నాయకులు శ్యాంసుందర్ గౌడ్, హుస్నాబాద్ గౌడ సంఘం అధ్యక్షుడు పూదరి రవీందర్ గౌడ్, మైనార్టీ జిల్లా నాయకుడు కుదరతుల్లా బాబా, అమీర్ అమీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమం చివరి భాగంలో ఒగ్గు కళాకారుడు పోతుగంటి శ్రీనివాస్ గౌడ్ నూట ఒక్క దీపాల ప్రదర్శన ప్రదర్శన విద్యావంతులను ఆకట్టుకుంది.